


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 05 సంచిక : 189 | శనివారం 08 ఆగస్టు 2026 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695










# సునేత్రా-పీకే భేటీ కలకలం

- కూటమి ధర్మం పాటించాలి
- బీజేపీ నుంచి గట్టి హెచ్చరిక
- మహాయుతిలో చీలిక భయమా?
- పార్టీ బలోపేతంపై పీకే సలహాలు
- భేటీపై రాజకీయ చర్చ
- మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త మలుపు



**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (కెరటం న్యూస్):** బిహార్‌లోని బంకీపూర్ ఉప-ఎన్నికల్లో విజయం సాధించిన ప్రశాంత్ కిషోర్‌తో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం , నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సునేత్రా పవార్ భేటీ రాజకీయ వర్గాల్లో చర్చ రేపుతోంది. ఈ నేపథ్యంలో మహాయుతి కూటమికి ముప్పు తెచ్చే పనులు చేయొద్దని సునేత్రాకు మహారాష్ట్ర బీజేపీ మంత్రి చంద్రశేఖర్ బవాన్కులే హితవు పలికారు. 'కూటమిలో చీలిక తెచ్చే ఏ నిర్ణయాన్ని తీసుకోవద్దు' అని మరాఠా రెవెన్యు మంత్రి సూచించారు. "ఇది వాళ్ల పార్టీ అంతర్గత వ్యవహారం. అయితే, మహాయుతి కూటమిలో ఉంటూ.. భాగస్వామ్య పక్షాలలో అనుమానాలు రేకెత్తించేలా లేదా ఏ పార్టీకైనా నష్టం కలిగించేలా ప్రవర్తించకూడదు.. అందరూ కూటమి ధర్మాన్ని పాటించాల్సిందే" అని ఆయన స్పష్టం చేశారు.

పీకేతో భేటీకి కారణం ఏంటి?

ప్రస్తుతం మహారాష్ట్ర మహాయుతి సర్కారులో బీజేపీతో పాటు సునేత్రా పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన కూటమి భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. "ఆమె ప్రశాంత్ కిశోర్‌ను ఎందుకు కలిశారనే దానిపై నేను ఎక్కువగా మాట్లాడను..కానీ కూటమిలో అపనమ్మకం లేదా మనస్పర్థలు కలిగించేలా ఎవరూ ప్రవర్తించరాదు" అని మంత్రి చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. దక్షిణ ముంబయిలోని తన అధికారిక నివాసం 'దేవ్‌గిరి'లో ప్రశాంత్ కిషోర్‌తో సునేత్రా పవార్ భేటీ అయినట్టు ఎన్సీపీ నేత సంజయ్ ఖోడ్కే ధ్రువీకరించారు.

# 'మెటా'కు దెబ్బమీదదెబ్బ

- మెటాపై రూ.7,800 కోట్ల భారీ జరిమానా
- పిల్లల భద్రత నిర్లక్ష్యమే కోర్టు ఆగ్రహం
- టీనేజర్ల మానసిక ఆరోగ్యానికి నష్టం ఆరోపణలు
- బాధిత యువత చికిత్సకు జరిమానా నిధులు
- కోర్టు తీర్పుపై పైకోర్టుకు మెటా అప్పీల్

# దస్త్రావేజులు నకిలీ దందా అసలైనది!




- ఎన్వోసీ మాఫియా బట్టబయలు!
- ఫైర్ సేఫ్టీ పేరుతో భారీ దగా
- కాలేజీలకు ఫేక్ అనుమతుల వరద
- ఇంటర్ బోర్డులో అవినీతి కలకలం
- ముడుపులతో నడిచిన అఫిలియేషన్లు
- భద్రతను పణంగా పెట్టిన కాలేజీలు
- నకిలీ ఎన్వోసీలపై సర్కార్ సీరియస్
- అధికారులపై విచారణకు రంగం సిద్ధం
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (కెరటం న్యూస్):** రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీల అనుమతులు, ఫైర్ ఎన్వోసీల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మొదట చిన్నదిగా కనిపించినా ఈ బోగస్ సర్టిఫికెట్ల వ్యవహారం చినికిచినికి గాలివానలా మారి మొత్తం ఇంటర్ మీడియట్ బోర్డునే చుట్టుముడుతున్నది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ సాగిన ఈ దందా, అధికారుల లంచాల వాటాల్లో తేడాలు రావడంతోనే రచ్చకెక్కింది. ఐదారేళ్లుగా కనీస నిబంధనలు పాటించని, కమర్షియల్ బిల్డింగ్ లో నడుస్తున్న కాలేజీలకు అధికారులు అనుమతిస్తూ వచ్చారు. అలాంటి కాలేజీలే ఇప్పుడు ముడుపులు ముట్టజెప్పి నకిలీ ఎన్ఓసీలు సమర్పించాయని తెలుస్తున్నది. ఫైర్ ఎన్వోసీల వ్యవహారం క్యూర్ పరిధిలోని డీఐఈఓలు, ఇంటర్ బోర్డులోని ముగ్గురు అధికారులకు తెలిసే కొన్నేళ్లుగా కొనసాగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మిగతాది 2 లో..

# చాందీపూర వైరస్‌తో దేశంలో కలకలం

- 22 మంది చిన్నారులు బలి
- మరో ఏడుగురి పరిస్థితి విషమం
- సాండ్‌ఫ్లై ద్వారా వైరస్ వ్యాప్తి
- కేంద్ర బృందం రంగంలోకి
- గుజరాత్‌లో హెల్త్ అలర్ట్




**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (కెరటం న్యూస్):** గుజరాత్‌లో 'చాందీపూర' వైరస్ కలకలం రేపుతోంది. ఈ ప్రాణాంతక వైరస్ బారిన పడి ఇప్పటివరకు ఏకంగా 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయాన్ని గుజరాత్ ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా అధికారికంగా ధృవీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 184 అనుమానిత కేసులు నమోదు కాగా, అందులో 35 మందికి వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.

# త్వరలో డిజిటల్ అసెంబ్లీ ప్రారంభం

- పేపర్‌లెస్ పాలనకు శ్రీకారం
- 80 లక్షల ఇళ్లకు టీ-ఫైబర్
- ఏఐతో ప్రభుత్వ సేవల విస్తరణ
- రియల్‌టైమ్ గవర్నెన్స్ డ్యాష్‌బోర్డ్
- డిజిటల్ తెలంగాణ దిశగా అడుగులు



**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (కెరటం న్యూస్):** రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాలనను మరింత వేగవంతం, పారదర్శకం చేసేందుకు ప్రభుత్వం అనేక విప్లవాత్మక డిజిటల్ కార్యక్రమాలను చేపడుతోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాసనసభ, మండలి వ్యవహారాలను సంపూర్ణంగా డిజిటలైజ్ చేస్తూ త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. GOVconnect, ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ (మీసేవ) సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన "ఏఐ ట్రాన్స్‌ఫార్మేషన్ కాంక్లేవ్ (తెలంగాణ)"ను ప్రారంభించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ప్రసంగించారు. డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వ శాఖల్లో పేపర్ లెస్ పాలనకు పెద్దపీట వేస్తున్నామని, నకిలీ పత్రాలకు తావులేకుండా భద్రమైన బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల సేవలను త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు ప్రకటించారు.

2 లో

# నాగార్జునసాగర్‌లో వరుణ యాగం



- ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో వరుణ యాగం
- రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్ష
- యాదగిరిగుట్ట వేద పండితులతో శాస్త్రోక్త నిర్వహణ
- యాగ ఏర్పాట్లను సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్

# చంద్రుణ్ణి ఢీకొట్టిన స్పేస్ఎక్స్ ఫాల్కన్ రాకెట్



- గంటకు 8,700 కిలోమీటర్ల వేగంతో ఢీకొట్టు
- చంద్రుడిపై కొత్త భారీ క్రేటర్ ఏర్పాటైంది
- ఢీకొన్న ప్రాంతాన్ని చిత్రీకరించిన డానురి ఆర్బిటర్
- సోడియం, లిథియం వాయువుల ఆనవాళ్లు గుర్తింపు
- భూమికి ఎలాంటి ప్రమాదం లేదన్న శాస్త్రవేత్తలు
- అంతరిక్ష పరిశోధకులను ఆకట్టుకున్న అరుదైన ఘటన

# చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు.

గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. IIHT ద్వారా యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ.18 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ.980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ నల్ల బ్యాడ్జీలతో నిరసన



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) జిల్లా స్టీరిగ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరై, మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆయా పాఠశాలల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు పారుపల్లి నాగేశ్వరరావు, షేక్ రంజాన్ ,వెంగళరావు మల్లయ్యలు ఆయా పాఠశాలల వద్ద జరిగిన నిరసనలనుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పిఆర్సి ప్రకటించాలని, పెండింగ్ డీఏలను ,బిల్లులను విడుదల చేయాలని, హెల్త్ కార్డులను సక్రమంగా అమలు చేయాలని, గురుకుల, కేజీబీవీ, యుఅర్ఎస్, మోడల్ స్కూల్స్, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, పదోన్నతుల బదిలీల షెడ్యూల్ ను విడుదల చేయాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలకు నష్టదాయకంగా ఉన్న జీవో 25ను సవరించాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆగస్టు 12,13న మండల కేంద్రాల్లో నిరసనలు తహశీల్దార్ కార్యాలయంలో మెమోరాండంలు సమర్పిస్తామని, ఆగస్ట్-19 న జిల్లా కేంద్రంలో ధర్నా, పిఆర్సీ ప్రకటించేదాక నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరౌతామని, ఆగస్టు 29 న ఇందిరా పార్క్ లో మహాధర్నా నిర్వహిస్తామని,

అప్పటికీ స్పందన లేకుంటే సెప్టెంబరులో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ నిర్వహిస్తామని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యా శాఖ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తున్నామని ఘనంగా ప్రకటించినప్పటికీ కేవలం యుకెజి కే పరిమితం చేశారని, ప్రీప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12.00 గంటల వరకే నడపాలన్నారు కానీ ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం 4.00 వరకు ప్రీప్రైమరీ తరగతులు నడుస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలకు పంపితే మధ్యాహ్నం 12.00 తర్వాత పసి పిల్లలను ఎవరు చూసుకుంటారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని అన్నారు.

ప్రాథమిక విద్యకు నష్టదాయకమైన జిఒ 25 ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు టీచర్లు, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక టీచర్ ను నియమించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు డిఈఒ, రెవెన్యూ డివిజన్ కు ఒక డిప్యూటీ ఇఒ, అన్ని మండలాలకు ఎంఈఒ పోస్టులు మంజూరు చేయాలని,

పిఒ 2018 కి అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. టెట్ లో సర్వీసు వెయిటేజ్ ఇవ్వాలని, స్పెషల్ టెట్ ను సబ్జెక్టు వారీ పేపర్లతో నిర్వహించాలని, మెమో 57 ప్రకారం 2003 డియస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, విద్యా శాఖలో బిసి, గిరిజన గురుకులాల టైంటేబుల్ మార్చాలని, మోడల్ స్కూల్స్ ను, ఎయిడెడ్ స్కూల్స్ ను విద్యాశాఖలో విలీనం చేయాలని, కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పెండింగ్ బిల్లులకు ప్రతినెలా రూ.లు 2000 కోట్లు చొప్పున నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకన్న, రాంబాబు, నాగేశ్వరరావు, బాప్పన్, పద్మ , విజయ్ , నాగిరెడ్డి, బన్సీలాల్, యాదగిరి, సురేష్ సుధాకర్, ఉద్దండ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలు సత్వరం పరిష్కరించాలి

## పిఆర్ సి ని ప్రకటించి, పెండింగ్ డిఆర్ మంజూరు చేయాలి

## ఎస్జిపిఏటి నేతలు మేరిఏసుపాదం, పరిశపుల్లయ్య




**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యం వీడి సమస్యలు సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(ఎస్జిపిఏటి) రాష్ట్ర కార్యదర్శి విమేరిఏసుపాదం, పరిశపుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. పిఆర్సి, పెండింగ్ డిఆర్, ఉద్యోగవిరమణ బకాయిలు చెల్లింపు, హెల్త్ కార్డులు సత్వరం అందజేసి, నగదు రహిత వైద్యం అందించాలని, ప్రత్యేకోపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు తో పాటు పెన్షనర్ల కోసం ప్రత్యేక డైరెక్టరేటు ఏర్పాటు చేయాలని తాము కోరుతున్నామని మేరి ఏసుపాదం, పరిశపుల్లయ్య తెలిపారు. హైదరాబాద్ ఇందిరాపార్కులో పెన్షనర్ల సమస్యలతో పాటు పిఆర్సి, డిఏ, నగదు రహిత వైద్యం కోసం పెన్షనర్ల జేఏసి పిలుపుమేరకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు వేలాది మంది ధర్నా చేసారని, ఇప్పటికైనా ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఎస్జిపిఏటి నాయకులు కోరారు. పెన్షనర్లు తమ సమస్యల పరిష్కారానికై ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నారని, పెన్షనర్లు ఉద్యమాలు ఉధృతం కాకముందే సమస్యలు పరిష్కరించాలని ఎస్జిపిఏటి నాయకులు కోరారు. ఈరోజు హైదరాబాద్ లో జరిగిన పెన్షనర్ల మహాధర్నాలో ఖమ్మం జిల్లా నుండి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారని నాయకులు తెలిపారు. హైదరాబాద్ లో జరిగిన పెన్షనర్ల మహాధర్నాకు ఖమ్మం జిల్లా నుండి పాల్గొన్న పెన్షనర్లకు ఎస్జిపిఏటి రాష్ట్ర కార్యదర్శి వి. మేరిఏసుపాదం, జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయలరవికుమార్ నాయకత్వంవహించారు ధర్నా లో ఎస్జిపిఏటి నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, భాస్కరాచారి,కన్నెకంటి కృష్ణ మూర్తి,ఊడుగు వెంకటేశ్వర్లు, బెల్లం రాధాకృష్ణ మూర్తి,మధుకరరెడ్డి, ఊడుగుసుధాకర్, యండిహుస్సేన్, ప్రసాదరావు, మనోహరరాజు, నాగిరెడ్డి, వీరభద్రరావు, కమల, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ పేదలకు ఉపాధీ దూరం చేస్తున్న కేంద్రం

## జైలు భరోతో పేదల సత్తా చూపాలి

## వ్యకాస నేత కొండబోయిన నాగేశ్వరరావు



**కారేపల్లి, కెరటం న్యూస్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ పేదలకు ఉపాధిని దూరం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. కార్మిక, కర్షక, రైతు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదిన నిర్వహిస్తున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం కారేపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా రైతాంగ వ్యతిరేక చట్టాలను తీసుకువస్తోందన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను బలహీనపరిచే ప్రయత్నంలో భాగంగా కొత్త బిల్లులను తీసుకువచ్చి ఉపాధి అవకాశాలను దూరం చేస్తోందని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులకు రక్షణ కల్పిస్తున్న కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చి కార్మిక హక్కులను హరించడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పేదల సత్తా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కే.నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కేసగాని ఉపేందర్, ఎనమనగండ్ల రవి, ముండ్ల ఏకాంబరం పాసిని నాగేశ్వరరావు, నాగమణి, కమల, రాధ, హుస్సేన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# లాల్‌దర్వాజ బోనాలను తలపించిన త్రివేణి పాఠశాల బోనాల సంబరాలు



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** తెలంగాణ సంస్కృతి-సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను త్రివేణి టాలెంట్ స్కూల్స్, ఖమ్మం శాఖలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన వేడుకలు చిన్నపాటి లాల్‌దర్వాజ బోనాల జాతరను తలపించాయి.

బ్లూ, గ్రీన్, రెడ్, ఎల్లో హౌస్‌ల ఆధ్వర్యంలో నాలుగు బోనాలను సిద్ధం చేయగా, ప్రైమరీ, ఫౌండేషన్, ఇగ్నైట్, ఐఐటీ ఇంపాక్ట్ విభాగాల విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని పాల్గొన్నారు. పోతరాజుల వేషధారణలు, డప్పుల వాయిద్యాలు, జానపద నృత్యాలు, రంగం (భవిష్యవాణి) ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విద్యార్థులు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో సమర్పించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ డా. వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని, ప్రపంచ స్థాయి విద్యతో పాటు భారతీయ విలువలను విద్యార్థులు అలవరచుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడం త్రివేణి టాలెంట్ స్కూల్స్ లక్ష్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సీఆర్వో కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని విద్యార్థుల్లో నాటేందుకు పాఠశాల చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల తల్లిదండ్రుల మరియు స్థానికుల ప్రశంసలు అందుకుంది.

# కాన్సర్ ను నిరోదించేందుకే హెచ్ పి వి వ్యాక్సిన్

## యు పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ దేవిశ్రీ

## నయబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికలకు ఉచిత హెచ్ పి వి వ్యాక్సినేషన్



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** క్యాన్సర్ వ్యాధిని సమూలంగా నిరోదించేందుకే హెచ్పీవీ వ్యాక్సిన్ ను ఇస్తున్నట్టు యూపీహెచ్సీ వెంకటేశ్వర్ నగర్ వైద్యాధికారి డాక్టర్ ఐ దేవిశ్రీ తెలిపారు. శుక్రవారం నాయబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 14ఏళ్ళు నిండిన బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్ వేశారు. బాలికల్లో భవిష్యత్తులో గర్భశాయ క్యాన్సర్ రాకుండా నిరోధించిందానికే ఈ వ్యాక్సిన్ ఇస్తున్నట్టు వెల్లడించారు. ఈ లక్ష్యంతో జిల్లా కలెక్టర్ దివాకర ఐ ఏ ఎస్ ఆదేశాలమేరకు జిల్లా వైద్యాధికారి ది రామారావు పర్యవేక్షణలో ఈ కారక్రమం అమలుజరుగుతుందన్నారు. అధికారికంగా ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్నప్పటికీ దీనిపై కొంత మంది అపోహలు, అనుమానాలు వ్యక్తంచేస్తున్నారని పేర్కొంటూ దానిని తీవ్రంగా ఖండించారు. దీనివల్ల ఎలాంటి చెడుప్రభావాలు ఉండవని, అర్హులైన ప్రతీ బాలికలకు వ్యాక్సిన్ వేస్తున్నామని ఇందుకోసం తాము అన్ని పాఠశాలల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీనికిపాఠశాలల యాజమాన్యాలు, తల్లి, దండ్రులు బాధ్యత తీసుకోవాలని ప్రతీఒక్కరూ సహకరించి కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషిచేయాలని కోరారు. వ్యాక్సినేషన్ కార్యక్రమానికి సహకరించిన పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ దేవిశ్రీ విద్యార్థులకు, పాఠశాల సిబ్బంది, పిల్లల కుటుంబసభ్యులకు ఈ వ్యాక్సిన్ కార్యక్రమంపైన అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ దేవిశ్రీ తోపాటు సూపర్ వైజర్ జడ్ ఎస్ జయపాల్, ప్రధానోపాధ్యాయురాలు సి హెచ్ ఉషారాణి, ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు ఎం గురవమ్మ, ఏ ఎన్ ఎం లు వి శారద, కోట ప్రసన్న, బి సంధ్య, ఎస్ కె రహీంబి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఇందిరా డైరీని సద్వినియోగం చేసుకోవాలి

## మత్కేపల్లి ఏఎంసీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు





**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** చింతకాని మండల కేంద్రంలోని రైతు వేదికలో వెలుగు ఆధ్వర్యంలో, డైరీ ఏపీఎం లక్ష్మణరావు అధ్యక్షతన ఇందిరా డైరీ పథకానికి సంబంధించి మైనార్టీ లబ్ధిదారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ, ఇందిరా డైరీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మానస పుత్రిక అని , భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలోనే బోనకల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ డైరీకి రూపకల్పన చేశారని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.చింతకాని మండలంలోని సుమారు 4 వేల మంది మహిళా సభ్యులకు ఇందిరా డైరీ పథకం ద్వారా సబ్సిడీపై గేదెలను అందించి, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుండటం అభినందనీయమన్నారు. ఇందిరా డైరీ ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నారు ప్రభుత్వం ద్వారా గేదెలను పొందిన డ్వాక్రా మహిళలు వాటిని విక్రయించకుండా, గేదెల ద్వారా లభించే పాల ఉత్పత్తులను విక్రయిస్తూ ఆదాయం పెంచుకోవాలని తద్వారా తమ కుటుంబాల ఆర్థిక అవసరాలను తీర్చుకోవడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు.మహిళా సాధికారతే రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది అని ,మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని అంబటి అకాంక్షించారు . ఈ శిక్షణ కార్యక్రమంలో అధికారులు పాడి పరిశ్రమపై అవగాహన కల్పించడంతో పాటు ఆధునిక పశుపోషణ పద్ధతులు, పశువుల ఆరోగ్య సంరక్షణ, మేత నిర్వహణ, పాల ఉత్పత్తి పెంపు తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. లబ్ధిదారులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టి, పశువుల సంరక్షణలో మెరుగైన పద్ధతులను పాటిస్తూ అధిక పాల ఉత్పత్తి సాధించాలని, తద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యదవ్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు మడుపల్లి భాస్కరరావు, జిల్లా ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పల గోవిందరావు, వ్యవసాయ శాఖ ఏ.డీ. వాణిశ్రీ, చింతకాని వెటర్నరీ డాక్టర్ రాంజీ, నాగులవంచ వెటర్నరీ డాక్టర్ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ వెటర్నరీ అధికారి పండగ బాబు, వెటర్నరీ డాక్టర్ నరసింహ, వెలుగు సీసీలు, డ్వాక్రా గ్రూప్ సభ్యులు, ఇందిరా డైరీకి ఎంపికైన మైనార్టీ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఆగస్టు 15 లోపు పిఆర్సి ని ప్రకటించి ,అమలు చేయాలి
- మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ను రద్దు చేయాలి
- షేక్ నాగూర్ వలి, టీఎస్యుటిఎఫ్ , ఖమ్మం జిల్లా కార్యదర్శి



**మధిర, కెరటం న్యూస్:** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు నాలుగు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టీఎస్యుటిఎఫ్ మధిర మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండారు నాగరాజు, ఈ వీరయ్య ల ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి పాఠశాల విధులకు హాజరై, భోజన విరామ సమయంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) ఖమ్మం కార్యదర్శి షేక్ నాగూర్ వలి, ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ ఏ వినోద రావులు మాట్లాడుతూ పాఠశాలల మరియు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పిసి)ఆధ్వర్యంలో అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో అనివార్యంగా నాలుగు దశల పోరాట కార్యక్రమాన్ని ప్రకటించడం జరిగిందని తెలియజేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 లోపు పిఆర్సి నివేదికను తెప్పించుకొని 01.07.2023 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పెండింగ్‌లో ఉన్న ఆరు డిఎ లను వెంటనే విడుదల చేయాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయల బదిలీలు మరియు పదోన్నతుల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్ జి ఓ 25ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీస ఇద్దరు టీచర్లు, 40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలకు ఐదుగురు టీచర్లను కేటాయించాలన్నారు.

గురుకులాలు & మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 హెడ్ కింద వేతనాలు చెల్లించా లన్నారు. అందరికీ అందుబాటులో గల ప్రభుత్వ పాఠశాలల కుదింపు ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జి ఓ 317 కారణంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు ఉద్యోగులను తమ స్థానిక జిల్లాకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

పి ఆర్ సి ని అమలు చేసేంతవరకు ఉపాధ్యాయు లందరూ ప్రతిరోజు నల్ల బ్యాడ్జిని ధరించి విధులకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 12 ¸ 13 తేదీల్లో జిల్లాలోని అన్ని తహసిల్దారు కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శన లో ఉపాధ్యాయులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 15 లోపు ప్రభుత్వం నుండి ఎలాంటి సానుకూల నిర్ణయం వెలబడకపోతే ఆగస్టు 19వ తేదీన జిల్లా కేంద్రాల్లో మరియు ఆగస్టు 29వ తేదీన రాష్ట్ర కేంద్రంలో వేలాదిమంది ఉపాధ్యాయులతో మహాధర్నా నిర్వహించడం జరుగుతుం దన్నారు. దశల వారి పోరాటంలో భాగంగా ఈరోజు పాఠశాల స్థాయిలో జరిగిన నల్లబ్యాడ్జీతో నిరసన కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు భారీగా పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

**పాలనలో రాజకీయాలకు తావులేదు**

**ఆగస్టు 15 నుంచి ఆసరా పింఛన్లు**

**తిరుమలాయపాలెంలో రూ. 7.00 కోట్ల పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన**



**తిరుమలాయపాలెం, కెరటం న్యూస్:** అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డిగూడెం నుంచి రాకాసితండా వరకు రూ. 2.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, రాజారాం నుంచి తుమ్మగూడెం వరకు రూ. 4.50 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే హైదర్ సాయిపేట, పాతర్లపాడు గ్రామాల్లో రూ. 20 లక్షల చొప్పున అంచనా వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ భవనాలకు భూమిపూజ నిర్వహించారు.

**సమగ్ర అభివృద్ధే ధ్యేయం..**

ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం సమపాళ్లలో పరుగులు తీయిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. తిప్పారెడ్డిగూడెం అభివృద్ధికి ఇప్పటివరకు రూ. 35.55 కోట్లు, హైదర్ సాయిపేటకు రూ. 37 కోట్లు, పాతర్లపాడుకు రూ. 29.25 కోట్లు, రాజారాం గ్రామానికి రూ. 8.48 కోట్లు మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. రైతాంగానికి మద్దతు ధరతో పాటు వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్, ఎకరాకు రూ. 6 వేల రైతు భరోసా జమ చేశామని గుర్తుచేశారు.

**ఇందిరమ్మ ఇళ్లు పారదర్శకం..**

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎవరికీ ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ప్రతి సోమవారం క్షేత్రస్థాయి ప్రగతి ఆధారంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే బిల్లులు జమ చేస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే రెండో విడత ప్రొసీడింగ్స్ అందజేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి నూతన ఆసరా పింఛన్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డిపిఓ వినోద్‌మార్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహణ



**నారాయణపేట, 07 ఆగష్టు (కెరటం న్యూస్):** ప్రపంచ ఆదివాసీ ప్రజల అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో గిరిజన హక్కుల పరిరక్షణ ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె. అవినాష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు, వెనుకబడిన వర్గాల ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. చట్టాల గురించి తెలియకపోవడం వల్ల చాలామంది తమ హక్కులు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందలేకపోతున్నారని అన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం నల్సా ద్వారా అనేక పథకాలు అమలులో ఉన్నాయని వివరించారు.

వృద్ధుల సంక్షేమ పథకాలు, రైతు సంక్షేమ పథకాలు, కట్న నిషేధ చట్టం, బాలల హక్కులు, మహిళల రక్షణ, చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎవరైనా చట్టపరమైన సమస్యలు ఎదుర్కొంటే భయపడకుండా డిఎల్ఎస్ఏను సంప్రదించాలని సూచించారు. పేదలు, గిరిజనులు, మహిళలు, దివ్యాంగులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.

న్యాయవాదులు మాట్లాడుతూ ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే తమ హక్కులను సమర్థంగా వినియోగించుకోగలరని అన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికత్వం, వరకట్న వేధింపులు, మహిళలపై హింస, వృద్ధుల సమస్యలు, వినియోగదారుల హక్కులు, రైతు చట్టాలు, కార్మిక చట్టాలు వంటి అనేక అంశాలపై వివరించారు. 14 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచిత విద్య అందించాల్సిన బాధ్యతపై, అలాగే 18 సంవత్సరాల లోపు మైనర్లు వాహనాలు నడపకూడదని సూచించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, మధ్యవర్తుల ప్రభావం లేకుండా నేరుగా లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 181 (మహిళా హెల్ప్‌లైన్), 15100 (నల్సా ఉచిత న్యాయ సహాయం), 112 (అత్యవసర సేవలు) నంబర్లను ప్రజలకు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ కుమార్, పంచాయతి సెక్రటరీ నిర్మల, న్యాయవాదులు దత్తాత్రేయ, శ్రీనివాసులు, సూర్యప్రకాశ్, నరేందర్ సాగర్, క్రాంతి కుమార్, ఎస్ఐ రేవతి, సర్పంచ్ వెంకట్ రాములు గౌడ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో మాజీ మంత్రి పువ్వాడ



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్ లో సీమ ఫ్యాన్సీ ఢఫర్నిచర్ అధినేత మొహమ్మద్ సిరాజుద్దీన్ కుమార్తె వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

కార్యక్రమంలో నాయకులు ఖమర్, పగడాల నాగరాజు, బచ్చు విజయ్ కుమార్, కూరాకుల వలరాజు, బత్తుల మురళి, తాజుద్దీన్, గొల్లపుడి రాంప్రసాద్, మాటేటి కిరణ్, షకీనా, సురేష్, వీరేందర్, మోహన్, గాదె అనిల్, అశోక్, ఉస్మాన్, రమేష్, రామ్మూర్తి, ముబీన్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మ సత్య ప్రసాద్ కు మాజీ మంత్రి పువ్వాడ నివాళులు





**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** బొమ్మ విద్యాసంస్థల అధినేత బొమ్మ రాజేశ్వరరావు కుమారుడు బొమ్మ సత్య ప్రసాద్ అనారోగ్యంతో పరమాపదించారు. వారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.సత్య ప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## పుట్టినరోజు సందర్భంగా కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి





**కుత్బుల్లాపూర్, 07 ఆగష్టు (కెరటం న్యూస్):** 276వ డివిజన్ ప్రగతి నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి (తాతిరెడ్డి)పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని, శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి.

ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, స్టేట్ మాజీ జనరల్ సెక్రటరీ షేక్ రఫియా బేగం, మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, వరగాని వాసు, సురేందర్ యాదవ్, రమేష్, రఫత్, ఆలేటి శ్రీనివాస్,పలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు నిత్య అన్నదాన సత్రం అదనపు గదుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వాన పత్రిక మున్నూరు కాపు సంఘ సభ్యులు





**కుత్బుల్లాపూర్ , 07 ఆగష్టు (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు పటేల్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య, ఆధ్వర్యంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్ర భవనము అదనపు గదుల ప్రారంభోత్సవం ఈ నెల 23వ తేదీన జరగనుంది. ఈ కార్యక్రమానికి బి ఆర్ ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభిపుర్ రాజు, ని ముఖ్యఅతిథిగా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బూరుగు లక్ష్మీనారాయణ, బురుగుబాబు సత్యనారాయణ, మేడ్చల్ జిల్లా యూత్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సాయిని శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ యుటిఎఫ్ కుత్బుల్లాపూర్ మండల శాఖ యూఎస్పిసి ఆధ్వర్యంలో టిఆర్సి నివేదికను వెంటనే అమలు చేయాలని నిరసన





**కుత్బుల్లాపూర్, 07 ఆగష్టు (కెరటం న్యూస్):** టి ఎస్ యూ టీ ఎఫ్ కుత్బుల్లాపూర్ మండల శాఖ (యూ ఎస్ పి సి) ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ మండలంలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొని నిరసన తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పురుషోత్తం, కుమారస్వామి మాట్లాడుతూ

పి ఆర్ సి నివేదిక ను వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని

పెండింగ్ డి ఏ లను ప్రకటించాలని సిపిఎస్ రద్దు ఓ పి ఎస్ ను పునరుద్ధరించాలని

పాఠశాలలో మౌళిక వసతులు కల్పించాలని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల టీఎస్ యుటిఎఫ్ కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.